సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం, 3, సెప్టెంబర్, 2025



చిరుజల్లులకు.. పూల వర్షం తోడైంది..
ఊరూరూ కదిలిరావడంతో దారంతా జనసంద్రమైంది..
ప్రతి పల్లె ముంగిట మహిళాలోకం హారతి పట్టింది...
అడుగడుగునా జై జగన్ నినాదాల హోరు మిన్నంటింది..
బొట్టు పెడుతూ ఒకరు.. దిష్టి తీస్తూ మరొకరు
అభిమానగణం ఘన స్వాగతం పలికింది..
తమ బిడ్డ రాకతో పులివెందులలోని ప్రతీగడప పులకించింది.
వైఎస్సార్ సీపీ అధినేత.. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
రెండో రోజు జిల్లా పర్యటన విజయవంతమైంది.

జననేతకు.. మహా హారతి



ఇడుపులపాయలో జనసందోహానికి అభివాదం చేస్తున్న వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి



మాజీ సీఎం వైఎస్ జగన్‌కి హారతి పళ్లెంతో స్వాగతం పలుకుతున్న మహిళలు, చిత్రంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్లకార్డుల ప్రదర్శన



అధినేతకు గజమాలతో సత్కారం

- నల్లపురెడ్డిపల్లె ప్రధాన దారి పొడవునా జనమే జనం
- మద్దతు ధర అందించని ప్రభుత్వ తీరుపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మండిపాటు
- దుగ్గన్నగారిపల్లె స్కూలు వద్ద చిన్నారులతో కాసేపు మాటామంతీ
- క్యాంపు కార్యాలయంలో ప్రజలు, కార్యకర్తలతో మమేకం

సాక్షి కడప/పులివెందుల: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటనలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మంగళవారం ఉదయం ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్సార్‌కు నివాళులర్పించి ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్న అనంతరం అంబకపల్లెకు పయనమయ్యారు. అక్కడ నుంచి అంబకపల్లె వరకు ఎక్కడ చూసినా రోడ్లపై జన జాతర కనిపించింది. అడుగడుగునా వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం లభించింది.

మద్దతు ధర ఇవ్వని కూటమి సర్కార్‌పై మండిపాటు

వేంపల్లె మండలం తాళ్లపల్లె వద్ద రైతులతో మాజీ సీఎం వైఎస్ జగన్ మాట్లాడారు. ముందుగా సమీపంలో ఉన్న ఉల్లి పంట పరిశీలించారు. ఉల్లి పంట కోస్తే కనీసం కూలీ ఖర్చులు కూడా లభించే పరిస్థితి లేదని రైతన్నలు వాపోయారు. దీనిపై స్పందించిన వైఎస్ జగన్ రైతులను ఆదుకోవడంలో కూటమి సర్కార్ పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఉల్లి, అరటి, బత్తాయికి సంబంధించి పూర్తిస్థాయిలో గిట్టుబాటు అయ్యేలా ధర అందించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే మానవత్వం లేని ప్రభుత్వ తీరును నిరసిస్తూ రైతులు తిరగబడతారని హెచ్చరించారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల మీదుగా అంబకపల్లెకు వెళుతున్న క్రమంలో నల్లపురెడ్డిపల్లెలో మహిళలు ఎదురొచ్చారు. కూటమి ప్రభుత్వం ఇటీవల వ్యవహరించిన తీరును నిరసిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. నల్లపురెడ్డిపల్లె ఊరు ఊరంతా కదిలొచ్చి ప్రభుత్వం వంచించిన తీరును వివరించారు. ఇలాంటి ఎన్నికలు ఎప్పుడు చూడలేదని వైఎస్ జగన్ దృష్టికి తీసుకొచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని.. సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను మోసం చేశారని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

అంబకపల్లె గంగమ్మ కుంట చెరువుకు జలహారతి

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం లింగాల మండలం అంబకపల్లె గ్రామ పరిధిలోని గంగమ్మ కుంట చెరువుకు జలహారతి ఇచ్చారు. ముందుగా గ్రామ ప్రజలు ఆయనను మంగళ హారతుల మధ్య తీసుకెళ్లారు. గతంలో పాడా నిధులతో నిర్మించిన ఈ చెరువులోకి భారీగా వర్షపునీరు వచ్చి చేరడంతో నూతన శోభ సంతరించుకుంది. అంతకుముందు అంబకపల్లె వైఎస్సార్ సీపీ నేతలు, శ్రేణులు వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలికారు. నల్లగొండువారిపల్లె నుంచి అంబకపల్లె వరకు రోడ్డుపై కిలోమీటర్ల మేర రోడ్డు కనిపించకుండా పూలు పరిచి పూల స్వాగతం పలికారు. క్రేన్ సహాయంతో అంబకపల్లెలో గజమాలలు వేసి తమ అభిమాన నేతను ఘనంగా సత్కరించారు.

విద్యార్థులతో కాసేపు..

వేంపల్లె నుంచి పులివెందులకు వస్తున్న వైఎస్ జగన్‌ని వేముల మండలం దుగ్గన్నగారిపల్లె వద్ద సెవెన్త్‌డే అడ్వంటిస్ట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు, ప్రజలు కలిశారు. వారితో జగన్ కాసేపు ముచ్చటించారు. అనంతరం సమీపంలోని పెద్ద ఎత్తున మహిళలు, ఉపాధ్యాయులు, ఇతర శ్రేణులతోనూ మాట్లాడుతూ ముందుకు కదిలారు.

వేంపల్లె నుంచి అంబకపల్లెకు 6గంటలు

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం ఇడుపులపాయ నుంచి బయలుదేరి వేంపల్లె మీదుగా పులివెందులకు వెళ్లే క్రమంలో రోడ్లన్నీ జనాలతో నిండిపోయాయి. దీంతో వేంపల్లెలో ఉదయం బయలుదేరితే అంబకపల్లెకు వెళ్లడానికి సాయంత్రం 4గంటలైంది. భారీగా వచ్చిన జనానికి మాజీ సీఎం వైఎస్ జగన్ అందరికి అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. మహిళలందరితోనూ మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకోవడంతోపాటు వాటి పరిష్కారానికి చొరవ చూపారు. అంబకపల్లెలో జలహారతి అనంతరం పులివెందులలోని క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు.

పార్టీ కార్యకర్తలు, శ్రేణులతో మమేకం

పులివెందులలోని భాకరాపురంలో ఉన్న క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రజలతో మమేకమయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన నేతలు, కార్యకర్తలతో మాట్లాడారు. ప్రజల కష్ట సుఖాలు, పార్టీ కేడర్ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. మరోవైపు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో చర్చిస్తూ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి చొరవ చూపారు.



మాజీ సీఎం వైఎస్ జగన్‌కి స్వాగతం పలుకుతున్న ముస్లిం చిన్నారులు



అభిమానులతో జననేత సెల్ఫీ..



జగనన్నను చూసిన ఆనందంలో అభిమానుల కేరింత

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: రిమ్స్ ప్రాంగణంలోని నర్సింగ్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఏఎన్ఎం కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కాల వ్యవధిలో కూడిన ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తులను రిమ్స్ ప్రాంగణంలోని కళాశాలలో సమర్పించాలని పేర్కొన్నారు. ప్రవేశాల ప్రక్రియ అక్టోబరు 15లోగా పూర్తి చేసి అదే నెల 21వ తేది నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. అభ్యర్థులకు ఎలాంటి వయోపరిమితి లేదని, అర్హులకు ఉపకార వేతనాల కింద రూ. 2000–2500 వరకు ఇస్తారన్నారు. వివరాలకు 90142 89905, 92908 14424 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి పవిత్రోత్సవాలు

కడప సెవెన్‌రోడ్స్: దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 4 నుంచి 7వ తేది వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నా రు. తొలిరోజు సాయంత్రం ఆరు గంటల నుంచి అంకురార్పణ, మృత్సంగ్రహణం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అనుజ్ఞ, రక్షాబంధనం, అఖండ దీపారాధన, పవిత్రాధివాసం నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు చతుస్థాన అర్చన, ద్వార తోరణ, అనంత కలశ పూజ, అగ్ని ప్రతిష్ఠ, పవిత్ర ప్రతిష్ఠ నిర్వహిస్తారు. అదేరోజు సాయంత్రం 6 నుంచి నిత్య హోమం ఉంటుంది. శనివారం ఉదయం పవిత్ర సమర్పణ నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం పవిత్ర విసర్జనలు, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ప్రతినిధులు తెలిపారు.

కడప మీదుగా హైదరాబాదుకు ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈనెల 9 నుంచి చర్లపల్లి–తిరుపతి మధ్య కడప మీదుగా రాను, పోను 24 ట్రిప్పులు ప్రత్యేక రైలును నడపనున్నారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. 07013 నెంబరుగల రైలు చర్లపలి–తిరుపతి మధ్య ప్రతి ఈనెల 9వ తేది నుంచి నవంబరు 25వ తేది వరకు ప్రతి మంగళవారం నడుస్తుందని పేర్కొన్నారు. ఈ రైలు ప్రతి మంగళవారం రాత్రి 9.25 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, రొంపిచెర్ల, వినకొండ, ధనకొండ, మార్కాపురంరోడ్డు, కంభం, గిద్దలూరు, నంద్యాల, కోయిలకుంట్ల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కడప, రేణిగుంట మీదుగా తిరుపతికి మరుసటిరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతికి చేరుతుందన్నారు. తిరిగి ఇదే రైలు ప్రతి బుధవారం 07014 నెంబరుతో ప్రతి బుధవారం సాయంత్రం 4.40 గంటలకు తిరుపతిలో బయలుదేరి ఇదే మార్గంలో మరుసటిరోజు ఉదయం 8.00 గంటలకు చర్లపల్లికి చేరుతుందన్నారు.

మహానేతకు ఘన నివాళి

వైఎస్సార్... భౌతికంగా మనిషి దూరమై పదహారేళ్లు గడిచాయి.. ఓ నాయకుడిగా ఆయన చేసిన మంచి ఇప్పటికీ ఉంది.. ఎప్పటికీ నిలిచే ఉంటుంది.. పేదల గుండె గడపల్లో ఆ నామం నిత్యం ధ్వనిస్తూనే ఉంది. ఆయన రూపం కళ్లముందు కదలాడుతూనే ఉంది. దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆ సత్యం నిరూపితమైంది. జోహార్..వైఎస్సార్ అనే నినాదం ఊరూరా మార్మోగింది. జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. పల్లె..పట్టణం తేడా లేకుండా అభిమానులు అన్నదానాలు చేశారు. రక్తదాన శిబిరాలు, పాలాభిషేకాలు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

- వైఎస్సార్ సేవలను స్మరించుకున్న నేతలు
- జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు

కడప కార్పొరేషన్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు నివాళి అర్పించారు. కడప నగరంలోని హెడ్‌పోస్టాఫీసు వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు.



జిల్లా కేంద్రమైన కడపలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటిస్తున్న జిల్లా నేతలు, పార్టీ శ్రేణులు

- మైదుకూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.
- జమ్మలమడుగు పట్టణంలో టీటీడీ కళ్యాణ మండపం వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు. యర్రగుంట్ల పట్టణంలో బస్టాండు వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళి అర్పించారు.
- కమలాపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఎదుట ఉన్న వైఎస్సార్ విగ్రహానికి కమలాపురం నియోజవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి పూలమాల వేసి అంజలి ఘటించారు. ప్రభుత్వ హాస్పిటల్‌లో మాజీ ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనాథ బాలుర క్షాత్రాలయంలో మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.
- పులివెందుల పట్టణంలోని భాకరాపురం వైఎస్సార్ ఆడిటోరియంలో కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పెద్ద ఎత్తున యువతీ, యువకులు ఇందులో రక్తదానం చేశారు. పులివెందుల బైపాస్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలను అందంగా అలంకరించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
- ప్రొద్దుటూరు పట్టణంలో మైదుకూరు రోడ్డులో అన్వర్ హాలు వద్ద, మున్సిపల్ కార్యాలయంలో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు మున్సిపల్ ఛైర్మన్ బి. లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారుముని రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె. నాగేంద్రారెడ్డి, ఆప్కాబ్ మాజీ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
- బద్వేల్ పట్టణంలోని గుంతపల్లె క్రాస్ రోడ్డు, బైపాస్ రోడ్డులో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గురుమోహన్, మున్సిపల్ అధ్యక్షుడు సుందరరామిరెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌కు నివాళి



మైదుకూరులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



ఎర్రగుంట్లలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌కు నివాళి



పేదలకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



కమలాపురంలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నరేన్ రామాంజులరెడ్డి



పులివెందులలో రక్తదానం చేస్తున్న వైఎస్సార్ అభిమానులు



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో జయలక్ష్మి కుటుంబ సభ్యులు

మాబాబుకు కంటి చూపు వచ్చింది!

- మీకు రుణపడి ఉంటాం
- మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎర్రగుంట్ల వాసులు

సాక్షి ప్రతినిధి కడప: 'మీ మంచి మనస్సుతో మా కుమారుడికి కంటి చూపు వచ్చింది' అని ఎర్రగుంట్ల వినాయక నగర్‌కు చెందిన జయలక్ష్మి, లాలప్ప కుటుంబం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఇడుపులపాయ నుంచి అంబకపల్లెకు వెళ్తున్న ఆయన్ను వెంకటాపురం గ్రామం వద్ద కలుసుకున్నారు. జయలక్ష్మి, లాలప్ప దంపతులకు ముగ్గురు సంతానం కాగా కుమారుడు శైలేష్ బాబుకు కంటి చూపు లేకపోవడం, అప్పటికే అన్ని రకాల ప్రయత్నాలు విఫలం కావడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వారు విజ్ఞాపన చేసుకున్నారు. కంటి ఆపరేషన్ల కోసం సీఎంఓ నుంచి నిధులు ఇవ్వడంతో ఆపరేషన్ విజయవంతం అయింది. వారు మంగళవారం పులివెందులకు చేరుకొని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ భావోద్వేగానికి గురయ్యారు. తన కుమారుడు శైలేష్‌బాబు చూడగలుగుతున్నాడు, చదవగలుగుతున్నాడు అంటే మీ దయ దాక్షిణ్యమేనని జయలక్ష్మి వివరిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌వారిని ఆప్యాయంగా ఆశీర్వదించి అక్కున చేర్చుకున్నారు.

క్లుప్తంగా

తనయుడిపై తండ్రి దాడి


చికిత్స పొందుతున్న రమేష్‌బాబు

జమ్మలమడుగు రూరల్ : రెండు సెంట్ల స్థలం విషయంలో కుమారుడిపై తండ్రి దాడి చేసిన సంఘటన మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. పట్టణ ఎస్ఐ రామకృష్ణ ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నా యి. ఎస్.ఉప్పలపాడు గ్రామంలో మారెన్నకు చెందిన 2 సెంట్ల స్థలాన్ని తనకు రిజిస్టర్ చేసి ఇవ్వాలని అతని కుమారుడు రమేష్‌బాబు తండ్రిని కోరాడు. ఈ విషయంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో తండ్రి మా రెన్న మచ్చు కత్తితో కుమారుడిపై దాడి చేశాడు. అడ్డు వచ్చిన తల్లి ఎల్లమ్మపై కూడా దాడి చేశాడు. ఈ సంఘటనలో కుమారుడు రమేష్‌బాబు తలకు గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు బాధితుడిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


టిప్పర్‌ను ఢీకొన్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు

కడప అర్బన్ : కడప– రాజంపేట రహదారిలో కడప నగర శివార్లలో రాజరాజేశ్వరి కళ్యాణ మండపం సమీపంలో మంగళవారం సాయంత్రం పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. ఉన్నట్టుండి ఎడమ వైపు నుంచి ఓ టిప్పర్ దూసుకురావడంతో రాజంపేటకు వెళుతున్న పల్లెవెలుగు ఆర్టీసీ బస్సు అదుపు చేసుకోలేక టిప్పర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు పాక్షికంగా దెబ్బతినింది. ఎవరూ గాయపడక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనపై కడప ట్రాఫిక్ పోలీసులు విచారిస్తున్నారు.

వరుస ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలతో బెంబేలు


ముద్దనూరులో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

ముద్దనూరు : మండలంలోని పలు గ్రామాల్లో గత నెల రోజుల వ్యవధిలో వరుసగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, అందులోని కాపర్ తీగలను చోరీ చేస్తున్నారు. దీంతో రైతులు, చిన్నతరహా పరిశ్రమల యజమానులు బెంబేలెత్తుతున్నారు. మండలంలోని ఆరవేటిపల్లెలో, శెట్టివారిపల్లెలో రెండు, ముద్దనూరులో రెండు పరిశ్రమలకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. మంగళవారం తాడిపత్రి జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ పరిశ్రమకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. వరుసగా జరుగుతున్న ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను అరికట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మొన్న కాలువ తీయించారు.. నిన్న పూడ్పించారు!


గత నెల 22న రెవెన్యూ అధికారుల ఆదేశాలతో పోలీసుల సమక్షంలో తీయించిన పంట కాలువ


మంగళవారం రోడ్డు నిర్మాణ అధికారులు పోలీసుల సమక్షంలో జేసీబీతో పంట కాలువ పైపులు తొలగిస్తున్న దృశ్యం

- రైతులతో అధికారుల చెలగాటం
- సాగునీటి సౌకర్యం కల్పించకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటున్న రైతులు
- గ్రీన్‌ఫీల్డుకు భూములిచ్చినా సాగునీరు లేకుండా చేస్తారా అని ఆవేదన

చాపాడు : మండలంలోని సోమాపురం గ్రామం వద్ద గ్రీన్‌ఫీల్డు హైవే నిర్మాణంలో వెళ్లిన పంట కాలువ పైపులను మంగళవారం మధ్యాహ్నం రోడ్డు నిర్మాణ అధికారులు తీయించారు. సాగునీటిని అందించే పైపులు తొలగిస్తే నాటుకున్న వరి పైర్లు ఎలా పండించుకోవాలని బాధిత రైతులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు రైతులను అడ్డుకున్నారు. బాధిత రైతులు తెలిపిన వివరాల మేరకు.. బెంగుళూరు – విజయవాడ గ్రీన్‌ఫీల్డు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో మండలంలోని సోమాపురం వద్ద గల సర్వే నెంబరు 28–4బి2లో 8 ఎకరాల వ్యవసాయ సాగు భూమికి పంట లేకుండా పోయింది. అయితే రైతుల అవసరం మేరకు రోడ్డు నిర్మాణంలో పంట కాలువ కోసం పైపులు నిర్మించినప్పటికీ ఇరువర్గాల మధ్య ఏర్పడిన ఆధిపత్య పోరులో పంట కాలువ సమస్యగా మారింది. ఈ క్రమంలో బాధిత రైతులైన అంకిరెడ్డిపల్లె రామచంద్రారెడ్డి, పెద్ద కొండారెడ్డి, చిన్న కొండారెడ్డి, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డిలతో పాటు మరి కొంత మంది మహిళా రైతులకు చెందిన 8 ఎకరాల సాగుభూమికి సాగునీరు అందేలా పంట కాలువ ఏర్పాటు చేయాలని అధికారులకు మొర పెట్టుకున్నారు. ఈ క్రమంలో గత నెలలో జమ్మలమడుగు ఆర్డీఓ, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇదే క్రమంలో గత నెల 19న రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా 22న రెవెన్యూ అధికారులు పోలీసుల సమక్షంలో పంట కాలువ తీయించారు. ఇదే పంట కాలువ విషయమైన 20న ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. అయితే అప్పటి నుంచి అధికారులు తీయించిన పంట కాలువ ద్వారా బాధిత రైతులు వరి సాగు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 2న రోడ్డు నిర్మాణ అధికారులు పంట కాలువకు ఉండే పైపులను తొలగించారు. వీటిని తొలగిస్తే సాగునీరు ఎలా వస్తుందని, పంటలు ఎండిపోతాయని బాధిత రైతులు పనులను అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. భూములకు సాగు నీరు అందించే పంట కాలువ లేకుండా చేయడం ఏమిటని, దీనికి పోలీసులు సహకరిస్తే తాము పంటలు ఎలా పండించుకోవాలని బాధిత రైతులు వాపోయారు. వారం రోజుల క్రితం పంట కాలువ తీయించిన అధికారులు స్పందించి తమకు న్యాయం జరిగేలా పంట కాలువ తీయించాలని కోరుతున్నారు. లేకుంటే ఆత్మహత్యలే శరణ్యమని బాధిత రైతులు వాపోయారు.

టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో వర్గపోరు

పెనగలూరు : తెలుగుదేశం పార్టీ గ్రామస్థాయి సంస్థాగత ఎన్నికలు మంగళవారం ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో పోటాపోటీగా జరిగాయి. పలు పంచాయతీల నుంచి విశ్వనాథ నాయుడు వర్గీయులు ఓవైపు, రూపానందరెడ్డి వర్గీయులు మరో వైపు తమకే పదవులు కావాలంటూ పోటీ పడ్డారు. మండల పరిశీలకుడు శ్రీనాథ్ రెడ్డి ఒక్కో పంచాయతీ సభ్యుడిని పిలిపించి వారి మనోగతాన్ని తెలుసుకొని ఇరువర్గాల నుంచి పేర్లను సేకరించారు. మండలంలో 16 పంచాయతీలు ఉండగా ఐదు, ఆరు పంచాయతీలు మినహా మిగిలిన అన్ని పంచాయతీలలో విశ్వనాథ నాయుడు వర్గం, రూపానందరెడ్డి వర్గీయులు తమకే పదవులు కావాలని పట్టుబట్టారు. దీంతో ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి ముందు జాగ్రత్త చర్యగా బయట ప్రాంతం నుంచి పోలీసు బలగాలను రప్పించి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడి పదవికి కూడా రెండు వర్గాల మధ్య పోటాపోటీ నెలకొంది.

మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి


మాట్లాడుతున్న వరుదు కళ్యాణి. చిత్రంలో ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో మహిళల రక్షణను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి మండిపడ్డారు. మహిళలపై అఘాయిత్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కడపలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. మహిళలు, రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు ప్రభుత్వం మోసం చేసిందన్నారు. పైగా రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వేలాది బెల్టుషాపులు ఏర్పాటు చేశారని.. మద్యం విచ్చలవిడిగా దొరకడం వల్ల మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రతిరోజూ మహిళలపై 70 అఘాయిత్యాలు జరుగుతున్నాయని.. ప్రతి గంటకు 4 కేసులు నమోదవుతున్నాయని చెప్పారు. పోలీసులను ప్రజల రక్షణకు ఉపయోగించకుండా.. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుకు, ప్రతిపక్షాలపై కక్షసాధింపులకు వాడుతున్నారని ధ్వజమెత్తారు.

పీఆర్సీ, డీఏల సంగతేంటి?

ఉద్యోగులకు ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు వారిని పట్టించుకోవట్లేదని ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి విమర్శించారు. పీఆర్సీ వేయలేదని, ఐఆర్ ఇవ్వలేదని, పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు విడుదల చేయలేదని మండిపడ్డారు. 20 లక్షల ఉద్యోగాలు, రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామంటూ యువతను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీ మేరకు అన్నదాత సుఖీభవ హామీని సైతం నెరవేర్చలేదని మండిపడ్డారు. విత్తనాలు, ఎరువులు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విజయ మనోహరి, ఎంవీ శ్రీదేవి పాల్గొన్నారు.

వైవీయూ భవనాలకు మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన


వైవీయూ భవన నిర్మాణ పనుల శిలాఫలకం ప్రారంభిస్తున్న మంత్రి నారా లోకేష్

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వవిద్యాలయం అకడమిక్ బిల్డింగ్, ఆడిటోరియం, వెయిటింగ్ రూమ్, రెస్ట్ రూమ్ నిర్మాణాల శంకుస్థాపన శిలాఫలకాన్ని మానవ వనరుల అభివృద్ధి, సమాచార సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. పెండ్లిమర్రి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం భారత ప్రభుత్వం ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్ (పీఎం ఉష) కింద రూ.10.5 కోట్లతో యోగివేమన విశ్వవిద్యాలయ భవన నిర్మాణాల ప్రారంభ కార్యక్రమం జరిగింది.

స్మార్ట్ కిచెన్ సెంటర్ ప్రారంభం

చింతకొమ్మదిన్నె : రాష్ట్ర విద్య, మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్ చింతకొమ్మదిన్నెలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ సెంటర్‌ను, ఆర్వో ప్లాంట్ ను ప్రారంభించారు. సాయంత్రం కొలుములపల్లి సమీపంలో కమలాపురం నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రారంభం

పెండ్లిమర్రి : మండల కేంద్రం సమీపంలో నూతనంగా రూ.12కోట్ల రూసా నిధులతో నిర్మించిన ఆ అధునాతన ఆదర్శ డిగ్రీ కళాశాల భవనాలను, పరిపాలనా భవనాన్ని మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ విద్యాపరంగా నాణ్యత పెంచడానికి సూచనలు అడిగారు.

ఎగ్జిక్యూటివ్ సెంటర్ భవనం ప్రారంభం

కడప కార్పొరేషన్ : కొప్పర్తి పారిశ్రామిక వాడలో నూతనంగా నిర్మించిన ఎగ్జిక్యూటివ్ సెంటర్ భవనాన్ని రాష్ట్ర విద్య, ఐటి, సాంకేతిక, ఆర్టీజీ శాఖా మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. మంగళవారం చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని కొప్పర్తి ఎలక్ట్రానిక్ మ్యాను ఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో రూ.31.50 కోట్లతో నిర్మించిన ఎగ్జిక్యూటివ్ సెంటర్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం టెక్నోడోమ్ మానిటర్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ యూనిట్‌ను సందర్శించి అక్కడ లిక్విడ్ క్రిస్టల్ మాడ్యూల్ యూనిట్, డార్క్ రూమ్, ఈఎస్డీ ప్రొటెక్టెడ్ యూనిట్‌లను పరిశీలించారు. ఆ తర్వాత టెక్సానా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉత్పత్తి యూనిట్‌ను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత, రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్య శాఖామంత్రి మంత్రి టీజీ భరత్, కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిషోర్, ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్య రెడ్డి, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, జేసీ అదితి సింగ్ పాల్గొన్నారు.

కార్పెంటర్ ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న నాగరాజు

మదనపల్లె రూరల్ : అనారోగ్య పరిస్థితుల కారణంగా మనస్తాపం చెంది ఉరి వేసుకుని కార్పెంటర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మదనపల్లె మండలంలో మంగళవారం జరిగింది. పట్టణంలోని కోటవీధికి చెందిన నాగేంద్ర, శ్రీలత దంపతుల కుమారుడు టి.నాగరాజు(41) కార్పెంటర్‌గా పనిచేసేవాడు. అతనికి రామారావుకాలనీకి చెందిన వనితతో వివాహం కాగా ఇద్దరు సంతానం ఉన్నారు. మనస్పర్థల కారణంగా భార్య వనిత 17 సంవత్సరాల క్రితం భర్తను వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. పట్టణంలో కార్పెంటర్ పనులు చేస్తూ జీవిస్తున్న నాగరాజు ఏడాది క్రితం పనులు చేస్తుండగా ఉలి తగిలి కాలికి గాయమైంది. సరైన చికిత్స తీసుకోకపోవడం, పైగా షుగర్ వ్యాధి సమస్య ఉండటంతో ఇన్‌ఫెక్షన్ సోకి గాయం పుండుగా మారింది. ఈ క్రమంలో రెండు నెలలుగా తిరుపతిలో చికిత్స పొందాడు. అయినా ఫలితం లేకపోవడంతో అక్కడి డాక్టర్లు కాలు తొలగించాల్సి ఉంటుందని చెప్పారు. దీంతో ఇంటికి వచ్చిన నాగరాజు మనస్తాపం చెంది ఐదురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం మండలంలోని కొత్తపల్లె పంచాయతీ వడ్డిపల్లె సమీపంలోని ఎలుకకుంట వద్ద అల్లనేరేడు చెట్టుకు ఓ వ్యక్తి ఉరేసుకుని ఉండటాన్ని స్థానికులు గుర్తించి తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడిని ఉరి నుంచి కిందకు దించి అతని పక్కనే ఉన్న బ్యాగును పరిశీలించగా, అందులోని ఫోన్ నెంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుని తల్లి శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళావెంకటరమణ తెలిపారు.

శభాష్..వెంకటరమణ !

- తండ్రితనానికి కొత్త అర్థం
- కొడుకు కాజేసిన పింఛన్ల సొమ్మును చెల్లించిన తండ్రి


ఎంపీడీఓ గంగయ్యకు నగదును అందజేస్తున్న వెంకటరమణ

కురబలకోట : ఉద్యోగిగా కొడుకు తప్పు చేసినా తండ్రి తలవంచలేదు. పైగా విలువను చాటుకున్నాడు. బిడ్డ చేసిన తప్పిదాన్ని పేద వాడైనప్పటికీ తండ్రి పెద్ద మనసుతో సరిచేసి శభాష్ అనిపించుకున్నాడు. మనసును కదిలించే ఈ సంఘటనకు సంబంధించి వివరాలలోకి వెళితే.. కురబలకోట మండలం అంగళ్లు గ్రామం జోగివారిపల్లెకు చెందిన జె. వెంకటరమణ కుమారుడు జె. వెంకటేష్ అదే మండలంలోని తెట్టు గ్రామ సచివాలయంలో జూనియర్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి కేటాయించిన రూ.4,69,500ల నగదుతో వెంకటేష్ సోమవారం పరారైన విషయం తెలిసిందే. ఇతని కోసం తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. ఇది అతని తండ్రి వెంకటరమణను తీవ్రంగా కలచివేసింది. ఆయన మనసు విరిగిపోయింది. పింఛన్ల సొమ్ముతో ఉడాయించడం పట్ల ఎంతగానో చింతించాడు. కొడుకు చేసిన తప్పిదానికి తనే బాధ్యత వహించాడు. వెంటనే అతను తెలిసిన వారి వద్ద అప్పుచేసి కొడుకు ఎత్తుకెళ్లిన పింఛన్ సొమ్మును ఎంపీడీఓ గంగయ్యకు అందజేశారు. మంగళవారం పింఛన్‌దారులకు ఈ సొమ్మును కూడా పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. కొడుకు తప్పు చేసినా తండ్రి తన విలువను చాటుకున్నాడు. బిడ్డ భవిష్యత్తుకు మార్గం ఏర్పడుతుందన్న ఆశతో తండ్రి బాధ్యత వహించి నగదు చెల్లించడాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు. పిల్లలు తప్పు చేస్తే చేతులు దులుపుకోవడం సాధారణమైన ఈ రోజుల్లో తండ్రి తనానికి కొత్త అర్థం చెప్పారు. అంతేగాకుండా విలువలకు ప్రతిరూపంగా నిలిచిన వెంకటరమణ నిర్ణయం అధికార యంత్రాంగాన్ని కూడా కదిలించింది.

మరణించినా నేత్రాలు వృథా కారాదు

జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ మాధవి


ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : మరణించినా వారి నేత్రాలు వృథా కారాదని జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ మాధవి తెలిపారు. 40వ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా పట్టణంలోని శ్రీనివాసనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద ఆప్తాల్మిక్ అధికారి కేజే రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నేత్రదాన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ వయస్సు భేదం లేకుండా ఎవరైనా నేత్రదానం చేయొచ్చన్నారు. దెబ్బలు తగిలినప్పుడు, ఆపరేషన్ తర్వాత కొన్ని ఇన్ఫెక్షన్‌ల వల్ల, అంటు వ్యాధుల ద్వారా నల్లగుడ్డు దెబ్బతిని చూపు కోల్పోయే పరిస్థితి వస్తుందని తెలిపారు. అలాగే ఎయిడ్స్ వ్యాధి ఉన్న వారు, కొన్ని రకాల క్యాన్సర్ వ్యాధితో బాధపడే వారు,హెపటైటిస్ బీ, సీ ఉన్నవారు నేత్రదానం చేయరాదన్నారు. ఒక మనిషి చనిపోయిన తర్వాత 4 నుంచి 6 గంటల లోపల వారి నేత్రాలను సేకరించాలని చెప్పారు. డిప్యూటీ డీహెంహెచ్ఓ డాక్టర్ గీత మాట్లాడుతూ మనం మరణించిన తర్వాత మన కళ్లు వృథా కాకుండా నేత్రదానం చేస్తే ఇరువురు అంధులకు చూపును ప్రసాదించినవారం అవుతామని తెలిపారు. అనంతరం అర్బన్ హెల్త్ సెంటర్ నుంచి రాజీవ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మోహన్‌కాంత్, మధుకుమార్, రవికుమార్, డిప్యూటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, శోభ, ఆప్తాల్మిక్ ఆఫీసర్ తేజ, సీఓలు ఎంపీ సుబ్బారెడ్డి, నాగజ్యోతి, సూపర్‌వైజర్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

గేట్, ఇంజినీరింగ్ సర్వీస్ పరీక్షలపై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

వేంపల్లె : ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు అత్యంత ప్రసిద్ధి చెందిన పరీక్షలలో గేట్, ఇంజనీరింగ్ సర్వీసెస్ (ఐఈఎస్) పరీక్షలు ఎంతో ముఖ్యమైనవని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ కుమార్ స్వామి గుప్తా పేర్కొన్నారు. మంగళవారం ట్రిపుల్ ఐటీ ఉన్నత విద్య, పోటీ పరీక్షల విభాగపు అధికారి డాక్టర్ డి.కోనప్ప ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్–6 సహకారంతో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఎస్ ఇంజనీరింగ్ అకాడమీ వారిచే విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కెరీర్ లక్ష్యాల పైనే దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు ముఖ్య వక్తగా వచ్చిన ఎస్.ఇంజనీరింగ్ అకాడమీ విద్యావేత్త మణిమోహన్ త్రినాథ్ మాట్లాడుతూ విద్యార్థులకు గేట్ పరీక్ష, ఇంజనీరింగ్ సర్వీసెస్ పరీక్షలు, ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన పరీక్షలు రాసే విద్యార్థులకు సిలబస్ నిర్మాణం, ప్రశ్నపత్ర విధానం, తయారీ వ్యూహాలు, మాక్ పరీక్షల ప్రాముఖ్యత, స్థిరమైన అభ్యాసం, సమయపాలన, చిట్కాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ రమేష్ కైలాస్, పరిపాలన అధికారి రవికుమార్, ట్రిపుల్ ఐటీ అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో నిండా ముంచారు


మధుసాయి ట్రేడర్స్ వద్ద ఆందోళన చేస్తున్న బాధిత రైతులు

తాడిపత్రి రూరల్ : నకిలీ విత్తనాలు అంటగట్టి నిండా ముంచారని రైతులు వాపోయారు. పట్టణంలో వైఎస్సార్ సర్కిల్‌లోని మధుసాయి ట్రేడర్స్ వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. బాధిత రైతులు తెలిపిన మేరకు.. వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరు మండలం శెట్టివారిపల్లికి కొన్ని రోజుల క్రితం ఓ వ్యక్తి వెళ్లాడు. తాను తాడిపత్రిలోని మధుసాయి ట్రేడర్స్‌కు చెందిన ఉద్యోగి అని అక్కడి రైతులకు చెప్పాడు. తమ వద్ద సోహా 007 రకం మొక్కజొన్న విత్తనాలు ఉన్నాయని చెప్పాడు. కేవలం 110 రోజుల్లోనే పంట దిగుబడి వస్తుందని ఆశ చూపాడు. దాదాపు 30 మంది రైతులకు ఆ విత్తనాలు కట్టబెట్టాడు. అతని మాటలు నమ్మిన రైతులు విత్తనాలను కొనుగోలు చేసి ఎకరాకు రూ.40 వేల నుంచి 45 వేల వరకు పెట్టుబడి పెట్టి సాగు చేశారు. అయితే, 90 రోజులు కావస్తున్నా పంట సరిగా రాకపోవడం.. మొక్కజొన్న కంకులు కూడా నాసిరకంగా ఉండడంతో తాము మోసపోయిన విషయాన్ని గుర్తించిన రైతులు ఇటీవల తాడిపత్రికి వచ్చి సాయిమధు ట్రేడర్స్ యజమానికి పరిస్థితిని వివరించారు. విషయాన్ని విత్తన కంపెనీ దృష్టికి తీసుకెళతానని చెప్పిన ఆయన మళ్లీ పట్టించుకోలేదు. దీంతో బాధిత రైతులు సోమవారం తాడిపత్రికి వచ్చి దుకాణం వద్ద నాసిరకంగా ఉన్న కంకులతో ఆందోళన చేశారు. తమ గ్రామానికి వచ్చిన వ్యక్తి షాపులో ఉండడం గుర్తించి అతడిని నిలదీశారు. తాను కంపెనీ ప్రతినిధిని కాదని, షాపులో పనిచేస్తున్న గుమస్తా అని చెప్పడంతో రైతులు మరింత మండిపడ్డారు. తమకు న్యాయం చేసేంతవరకు వెళ్లేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. విషయం తెలుసుకున్న ఏడీఏ రవి.. పెద్దపప్పూరు ఏఓ మహితా కిరణ్‌ను దుకాణం వద్దకు పంపించారు. షాపులోని మొక్కజొన్న విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. విచారణ తరువాత కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేస్తామని ఏడీఏ రవి తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో ఆటోమ్యాట్ యాప్ ఆవిష్కరణ


ఆటోమ్యాట్ యాప్‌ను ఆవిష్కరించిన విద్యార్థులతో డైరెక్టర్, తదితరులు

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఆర్ – 21 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు రూపొందించిన ఆటోమ్యాట్ యాప్‌ను ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా ఆవిష్కరించారు. మంగళవారం వేంపల్లె మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఆటోమ్యాట్ యాప్ ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు ఎదుర్కొనే ఆటో సమస్యలను పరిష్కరించడానికి ఈ యాప్ ప్రత్యేకంగా రూపకల్పన చేశామన్నారు. ఈ ఆటో యాప్ ద్వారా షెడ్యూల్ ప్రకారం ఆటోలు అందుబాటులోకి వస్తాయని, నిజమైన, పారదర్శకమైన ధరల విధానంతోపాటు విద్యార్థుల భద్రత కోసం కంప్లైంట్ ఆప్షన్ ఉంటుందన్నారు. అలాగే తప్పు ప్రవర్తన, అధిక చార్జీలు, మొదలగు సమస్యలకు పరిష్కారం ఉంటుందన్నారు. యాప్‌ను ఆటో డ్రైవర్లకు చెందిన మొబైల్స్‌లో ఇన్‌స్టాల్ చేసి వారికి అవగాహన కల్పించారు. అనంతరం ఆటో యాప్‌ను రూపొందించిన విద్యార్థులు శివశంకర్, సాయినాథ్, రవితేజ, అంకిత్ కుమార్, సాయికుమార్, మణికుమార్‌లను అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి పెనుగొండ రవికుమార్, డీన్ అకడమిక్ రమేష్ కైలాష్, సీఎస్సీహెచ్ఓడీ రత్నకుమారి, సెక్యూరిటీ ఆఫీసర్ శరవణ కుమార్, అసోసియేట్ డీన్ వీరరాఘవ రెడ్డి, అడ్మిన్ లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాలుడిని గదిలో ఉంచి.. తాళం వేసిన అంగన్‌వాడీ టీచర్

- స్పృహ తప్పిపడిపోయిన వైనం
- తల్లిదండ్రుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం


బత్తల హరికృష్ణ

బ్రహ్మంగారిమఠం : పిల్లలందరూ ఇంటికి వెళ్లారని భావించి ఓ బాలుడు లోపల ఉండగానే అంగన్‌వాడీ టీచర్ బడికి తాళం వేసుకుని వెళ్లింది. చిన్నారి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు కంగారుతో బడి తాళాలు పగులగొట్టి చూడగా బాలుడు లోపల స్పృహ తప్పి పడిపోయి ఉన్నాడు. ఈ సంఘటన బ్రహ్మంగారిమఠం మండలంలోని గొడ్లవీడు పంచాయతీ పీసీపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో జరిగింది. బాలుడి తండ్రి వెంకటసుబ్బయ్య కథనం మేరకు.. వీరి కుమారుడు బత్తల హరికృష్ణ(5)ను రోజులాగే మంగళవారం కూడా అంగన్‌వాడీ కేంద్రానికి పంపించారు. ఉదయం 11 గంటలకు అంగన్‌వాడీ కేంద్రం టీచర్ చంద్రకళ, ఆయాలు పిల్లలను ఇళ్లకు పంపించి కేంద్రానికి తాళం వేసుకుని వెళ్లారు. వ్యవసాయ పనులకు వెళ్లిన బాలుడి తల్లిదండ్రులు మధ్యాహ్నం 2.30 గంటలకు ఇంటికి వచ్చి చూడగా పెద్ద కుమారుడు మాత్రమే ఇంట్లో ఉన్నాడు. చిన్న పిల్లాడు కనిపించకపోవడంతో అన్నిచోట్లా వెతికారు. అనుమానంతో అంగన్‌వాడీ కేంద్రం సిబ్బందిని ప్రశ్నిస్తే తాము 11 గంటలకే అందరినీ ఇళ్లకు పంపించి వేశామని, తమకు తెలియదని చెప్పారు. కేంద్రం తాళాలు ఇవ్వండి లోపల ఏమైనా ఉన్నాడేమో చూస్తామని చెప్పినా వారు వినిపించుకోలేదు. దీంతో బాలుడి తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా బాలుడు ఏడ్చి ఏడ్చి భయంతో అపస్మాకర స్థితిలో పడిపోయి ఉన్నాడు. వెంటనే వారు బాలుడిని తీసుకుని ఇంటికి వెళ్లారు. అంగన్‌వాడీ సిబ్బంది నిర్వాకాన్ని ప్రశ్నిస్తే ఎవరికి చెప్పుకుంటారో.. చెప్పుకోపోండి.. మీపైనే కేసు పెడతాం అంటూ వారు బెదిరిస్తున్నారని బాలుడి తండ్రి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.